సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



ఉత్సాహంగా స్కేటింగ్ ఎంపికలు

కడప నగరంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలోని స్కేటింగ్ రింక్‌లో సోమవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఎంపికలకు చక్కటి స్పందన లభించింది. - 8లో



ప్రజాస్వామ్యం.. అపహాస్యం

టీడీపీ నేతల నిర్వాకంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోంది. కనీసం వార్డు సభ్యులు కూడా కాని వ్యక్తులు సైతం ప్రభుత్వ కార్యక్రమాల వేదికలపై ఆశీనులవుతున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
25.4 /24.6

వాతావరణం

జిల్లాలో సోమవారం 24.6- 25.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : డీఎస్సీలో ఉచిత శిక్షణ కోసం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కడప అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ అర్హత కలిగి వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలలోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈనెల 21వ తేదీ లోపు జ్ఞానభూమి వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 27న స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. మెరిట్ లిస్టు ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణ తీసుకునేందుకు ఎంపిక చేస్తామని వివరించారు. మరిన్ని వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జ్ఞానభూమి.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

ఆకట్టుకున్న మంచు శివలింగం



అమరనాథ్ మంచు శివలింగం నమూనా

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక కొర్రపాడు రోడ్డులో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వైఎంఆర్ కాలనీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమరనాథ మంచు శివలింగ నమూనాను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. దసరా వేడుకల్లో భాగంగా కొండ గుహల మధ్య మంచుతో రూపొందించిన ఒకటిన్నర అడుగుల మంచు శివలింగాన్ని, బ్రహ్మంగారి విగ్రహ నమూనాను నాలుగు రోజుల పాటు వేలాది మంది ప్రజలు ఆసక్తిగా తిలకించారు. బ్రహ్మకుమారీస్ ఆంధ్ర, కర్ణాటక సబ్‌జోన్ అడిషనల్ ఇన్‌చార్జి రాజయోగిని గీతాబెహన్‌జీ, వైఎంఆర్ కాలనీ ఇన్‌చార్జి బీకే హేమాబెహన్‌జీ, బ్రహ్మకుమారీలు పర్యవేక్షించారు.

డిగ్రీ ఒకేషనల్ పరీక్షలు వాయిదా

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలో ఈ నెల 15 నుంచి జరగాల్సిన డిగ్రీ ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వర రెడ్డి తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను ప్రభావం అన్నమయ్య, వైయస్సార్ జిల్లాలపై ఉంటుందని ప్రకటించిన నేపథ్యంలో విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పరీక్షలను వాయిదా వేశామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ

రాయచోటి టౌన్ : రాయచోటిలో శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి పల్లకీ సేవ అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు మూల విరాట్‌లకు అభిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులకు పూజలు, అభిషేకాలు చేసి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, రంగు రంగుల పూలతో అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఊరేగించారు. ఈ పల్లకీ సేవ ఆలయ ప్రాంగణం, మాఢ వీధుల్లో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ముగిసిన లాటరీ ప్రక్రియ

- కలెక్టర్ శివశంకర్
- ఐదుగురు మహిళలకు ఏడు దుకాణాలు





లక్కీడ్రాకు హాజరైన దరఖాస్తుదారులు (ఇన్‌సెట్) లక్కీడిప్ తీసి టోకన్ చూపుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో నూతన మద్యం పాలసీ 2024–26 లాటరీ ప్రశాంతంగా నిర్వహించామని కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నూతన మద్యం పాలసీ 2024–2026 లాటరీ ప్రక్రియ విధానం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మద్యం పాలసీ 2024–2026 లాటరీ విధానం ప్రక్రియను స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించామన్నారు.

నూతన మద్యం పాలసీ మేరకు జిల్లాలో 139 మద్యం దుకాణాలు (కడప జిల్లాలో ఎక్సైజ్‌స్టేషన్‌ల వారీగా దుకాణాల వివరాలు ఇలా ఉన్నాయి. కడప స్టేషన్–30, సిద్ధవటం స్టేషన్–8, ఎర్రగుంట్ల స్టేషన్–14, జమ్మలమడుగు స్టేషన్–14, ప్రొద్దుటూరు స్టేషన్–19, పులివెందుల స్టేషన్–16, ముద్దనూరు స్టేషన్–7, మైదుకూరు స్టేషన్–16, బద్వేలు స్టేషన్–15 ఉన్నాయన్నారు. అందుకు 3,257 మంది దరఖాస్తు చేసుకున్నారని, 139 మద్యం దుకాణాలకు 139 మందిని లాటరీ ప్రక్రియ విధానం ద్వారా ఎంపిక చేశారు. తొలి విజేత డ్రాప్ అయినా మళ్లీ లాటరీ ప్రక్రియ లేకుండా రిజర్వులో ఇద్దర్ని పెట్టుకున్నారు. ఆమేరకు ప్రతి షాపునకు అలా లాటరీ కొనసాగిస్తూ 139 విజేతలను ప్రకటించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్ నాయక్, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సీఐలు కృష్ణ కుమార్, విశ్వనాథరెడ్డి, జహీర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



జెడ్పీ హాలు లోపలికి వస్తున్న దరఖాస్తుదారులు

ఐదుగురు మహిళలకు మద్యం షాపులు...

139 మద్యం షాపుల్లో 7 దుకాణాలు ఐదుగురు మహిళలకు దక్కాయి. సన్నపురెడ్డి సుజల (నంద్యాల మాజీఎంపీ ఎస్పీవైరెడ్డి కుమార్తె) పేరిట 3 మద్యం షాపులు లాటరీలో దక్కాయి. జమ్మలమడుగు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని షాపునెంబరు 58, 65, మైదుకూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని షాపు నెంబరు 111వ మద్యం దుకాణాలను లక్కీడిప్ ద్వారా దక్కించుకుంది. మరో నలుగురు మహిళలకు కూడా మద్యం షాపులు లాటరీలో దక్కాయి. 31వ షాపు కవిత, 68వ షాపు కళ్యాణి, 96వ షాపు రాజుల గంగాదేవి, 97వ దుకాణం శింగారెడ్డి సరస్వతికి లభించడం విశేషం.

రాజకీయ ఒత్తిళ్లు షురూ..

మద్యం దుకాణాల లాటరీదారులపై అప్పుడే రాజకీయ ఒత్తిళ్లు మొదలయ్యాయి. ముఖ్యంగా కమలాపురంలో టీడీపీ అంచనాలు తిరగబడ్డాయి. మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేయరాదంటూ ఎమ్మెల్యే వర్గీయులు కట్టడి చేశారు. జిల్లాలో చాలా తక్కువ దరఖాస్తులు లభించింది కూడా అక్కడే. ఈ పరిస్థితుల్లో లాటరీలో బీఆర్కే న్యూస్ చానల్ అధిపతికి కమలాపురం నియోజకవర్గంలో 4 మద్యం షాపులు లాటరీలో దక్కాయి. దరఖాస్తుల దాఖలుకు అడ్డుకున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి వర్గీయులకు ఈ పరిణామం మింగుడు పడలేదు. లాటరీలో లభించిన మద్యం షాపుల కోసం బేరసారాలు ఆరంభించారు. కడపలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డితో మాట్లాడిన తర్వాతే దుకాణాలు నిర్వహణ చేపట్టాలని ఆయన వర్గీయులు లాటరీ విజేతలకు ఫోన్లు చేస్తున్నారు. అలా కాదనీ ఎవరైనా సరే మద్యం దుకాణం నిర్వహణ కష్టసాధ్యమని హెచ్చరికలు చేస్తున్నట్లు సమాచారం.





లక్కీడ్రాకు హాజరైన మహిళలు



లక్కీడిప్‌ను బిగ్ స్క్రీన్‌పై చూస్తున్న దరఖాస్తుదారులు



దరఖాస్తుదారుల పత్రాలను పరిశీలిస్తున్న పోలీసులు



నగదుతో వచ్చిన దరఖాస్తుదారులు

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

డీఆర్వో గంగాధర్‌గౌడ్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్

కడప సెవెన్‌రోడ్స్: అర్జీదారులు విన్నవించే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన పరిష్కారాన్ని వేగవంతంగా అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, నేషనల్ హైవేస్ ఎస్డీసీ వెంకటపతి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మిలతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు.. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు.

డయల్ యువర్ కలెక్టర్

అంతకుముందు డీఆర్వో డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో నలుగురు తమ సమస్యలను ఆయనకు వివరించారు.

వైవీయూ రిజిస్ట్రార్ రాజీనామా ఆమోదం



వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ తప్పెట రామప్రసాద్ రెడ్డి రాజీనామాకు వర్సిటీ వీసీ కె. కృష్ణారెడ్డి సోమవారం ఆమోదం తెలిపారు. అక్టోబర్ 1న ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డిని రిజిస్ట్రార్‌గా నియమించగా, 3న ఆయన బాధ్యతలు స్వీకరించారు. లైంగిక ఆరోపణలున్న ఆయన నియామకంపై దుమారం రేగడంతో ఆయన బాధ్యతలకు దూరంగా ఉంటూ వచ్చారు. అనంతరం ఒక్కరోజు వ్యవధిలోనే 5న అనారోగ్య కారణాలతో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ బాధ్యతల నుంచి తప్పించాలంటూ రాజీనామాను వీసీకి పంపారు. దసరా సెలవులు అనంతరం సోమ వారం వర్సిటీ ప్రారంభం కావడంతో ఆయన రాజీనామాను వీసీ ఆమోదించారు. కాగా, రిజిస్ట్రార్ పదవికి పలువురు ఆచార్యులు ప్రయత్నాలు ప్రారంభించారు.

వైద్య విద్యను బాధ్యతగా అభ్యసించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ



హాజరైన వైద్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

- కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ
- 2024–25 బ్యాచ్ వైద్య విద్య విద్యార్థులకు స్వాగతం

కడప అర్బన్ : విద్యార్థులు వైద్య విద్యను బాధ్యతగా అభ్యసించాలని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ అన్నారు. సోమవారం కళాశాల ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో 2024–25 బ్యాచ్ వైద్య విద్యార్థులకు, వారి తల్లిదండ్రుల సమక్షంలో స్వాగతం పలికారు. తొలుత ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ జ్యోతిప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్య సేవకు అంకితం కావాలంటే అకుంఠిత దీక్ష, పట్టుదల, సేవాభావం కలిగి ఉండాలన్నారు. ప్రతి రోజూ అధ్యాపకుల సూచనలతో వైద్యవిద్యను నేర్చుకోవాలన్నారు. మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలంటే వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు. మానవసేవయే మాధవసేవ అని.. ప్రతి రోగికి వైద్య సహాయాన్ని శ్రద్ధగా చేయాలన్నారు. విద్యార్థులను కళాశాలలో వదిలేసి వెళ్లినట్లు కాకుండా మంచి నడవడికతో భవిష్యత్తును దిద్దుకునేలా తల్లిదండ్రులు వారిని అనుక్షణం కనిపెట్టుకుని సూచనలను చేస్తుండాలన్నారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, అనస్తీషియా హెచ్‌ఓడి డాక్టర్ సునీల్ చిరువెళ్ల, డాక్టర్ లక్ష్మీనరసమ్మ, అన్ని విభాగాల అధిపతులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జడివాన.. జనం హైరానా

జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, కడప కంట్రోల్ రూమ్ : 08562 – 246344

ఆర్డీవో కార్యాలయం, కడప : 89854 29256

ఆర్డీవో కార్యాలయం, జమ్మలమడుగు : 96188 04882

ఆర్డీవో కార్యాలయం, బద్వేలు : 70133 23862

ఆర్డీవో కార్యాలయం, పులివెందుల : 85200 82425; 95422 99885

కడప సెవెన్‌రోడ్స్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వానలు పడుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉంది. ఓ సమయంలో కాస్త తెరపిఇచ్చినా.. కాసేపటికే మళ్లీ ఊపందుకుంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

తుపాను కారణంగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రెవెన్యూ డివిజన్ల వారీగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. కలెక్టరేట్‌తోపాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. భారీవర్షాలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే ఆయా రెవెన్యూ డివిజన్ల కంట్రోల్ రూమ్ నెంబర్లకు కాల్ చేసి తెలుసుకోవచ్చని వివరించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించాలని, టామ్ టామ్ లేదా మైకుల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని ఆర్డీవోలు, తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ముందు జాగ్రత్తగా అనువైన ఆశ్రయ కేంద్రాలను గుర్తించాలన్నారు. మున్సిపల్, వైద్య, ఆరోగ్యం, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, విపత్తు నిర్వహణ (అగ్నిమాపక) తదితర శాఖల అధికారులు, వారి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం(మిమీ)	మండలం	వర్షపాతం(మిమీ)
సిద్ధవటం	29.6	కడప	3.2
అట్లూరు	20.2	రాజుపాలెం	3.0
గోపవరం	12.3	వల్లూరు	2.8
ఒంటిమిట్ట	10.8	ఖాజీపేట	2.4
బి.మఠం	10.2	సీకేదిన్నె	2.2
బి. కోడూరు	7.4	ఎర్రగుంట్ల	2.2
కాశినాయన	6.0	ప్రొద్దుటూరు	1.4
కలసపాడు	5.4	పెద్దముడియం	1.2
పోరుమామిళ్ల	5.2	మైదుకూరు	1.2
చెన్నూరు	4.8	వీఎన్‌పల్లి	1.0
దువ్వూరు	3.8	జమ్మలమడుగు	1.0



కడప ఆర్టీసీ బస్టాండులో బస్సు ఎక్కేందుకు ప్రయాణికుల అవస్థలు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూములు

కంట్రోల్ రూమ్	ఫోన్ నెంబరు
కడప (జిల్లా కంట్రోల్ రూమ్)	94408 17440
కడప డివిజన్	94408 17441
పులివెందుల డివిజన్	94914 31255
ప్రొద్దుటూరు డివిజన్	78932 61958
మైదుకూరు డివిజన్	94928 73325

కడప కార్పొరేషన్ : జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి 5 కంట్రోల్ రూములను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు, గాలులు వస్తున్నప్పుడు ప్రజలు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఈ సూచించారు. రైతులు వారి విద్యుత్ మోటార్ల దగ్గర జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎక్కడైనా కరెంటు లైన్లు తెగి పడినా, స్తంభాలు విరిగి పడినా సంబంధిత లైన్‌మెన్‌కి గాని సంబంధిత సబ్‌స్టేషన్‌కి గానీ.. కంట్రోల్ రూమ్ లకు గాని వెంటనే తెలియపరచాలన్నారు. విద్యుత్ సమస్యల ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912 కాల్ చేసి పరిష్కరించుకోవాలని తెలియజేశారు.



వాన ఎంత కష్టం తెచ్చిందో..





వానా..వానా వెల్లువాయే..

తుపాను ప్రభావం జిల్లా కేంద్రమైన కడపలో ఎక్కువగా కనిపించింది. సోమవారం తెల్లవారుజామున నుంచి వాన జడిపట్టింది. ఉదయం నుంచే మేఘాలు దట్టంగా అలుముకుని కనిపించాయి. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. ఆర్టీసీ బస్టాండు ఎప్పటిలాగే జలమయమైంది. బస్సులు ఎక్కడానికి.. దిగడానికి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

క్లుప్తంగా

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు వర్షం కారణంగా డ్రాగా ముగిశాయి. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన కడప, కర్నూలు మ్యాచ్ డ్రాగా ముగియడంతో ఇరుజట్లకు చెరో పాయింట్ కేటాయించారు. కేఓఆర్ఎం మైదానం మ్యాచ్‌లో చిత్తూరు, తూర్పుగోదావరి మ్యాచ్ డ్రాగా ముగియడంతో ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన ప్రకాశం, పశ్చిమగోదావరి మ్యాచ్ డ్రాగా ముగియడంతో ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు.

ఘర్షణ: ఇరు వర్గాలపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని బాలాజీపేటలో ఈనెల 13న ఆయుధపూజ చేస్తున్న సమయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. లోకేష్ అతని తండ్రితో పాములేటి, వినీత్, మరొకరు వాగ్వాదం చేస్తూ ఘర్షణకు దిగారు.ఈ సఘటనలో ఇరు వర్గాల వారు గాయపడటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఒక వర్గానికి చెందిన ముగ్గురిని, మరో వర్గానికి చెందిన ఇద్దరిని నిందితులుగా చేర్చి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి



ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' జరిగింది. ప్రజల నుంచి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ కె. ప్రకాష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

మదనపల్లె : అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. కర్నాటక రాయల్పాడు బల మత్తూరుకు చెందిన భాస్కర్‌రెడ్డి(36) వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చి అతిగా మద్యం తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా, పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

వర్షంతో ఆరుతడికి జీవం

- జిల్లా అంతటా జడివాన
- ప్రారంభం కానున్న రబీ సీజన్
- ఫలించనున్న శనగ రైతుల ఆశలు
- వర్షంతో ఖరీఫ్ ఆరుతడి పంటలకు ఎంతో మేలు
- రాబోయే వర్షాలతో అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు
- ఈనెల 16 వరకు జిల్లాకు వర్ష సూచన



వర్షం రాకతో ఖాజీపేట మండలంలో కళకళలాడుతున్న వరిపంట

కడప అగ్రికల్చర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షం కురుస్తోంది. సోమవారం ఉదయం కొద్ది సేపు తెరపు ఇచ్చినట్లే ఇచ్చి ఆ తరువాత మళ్లీ ఊపందుకుంది. ఉదయం 7 గంటల నుంచి నిర్విరామంగా సాయంత్రం 3 గంటల వరకు జడవాన పడుతూనే ఉంది. ఆ తరువాత కాసింత నెమ్మదించింది. జిల్లాలో చాలా కాలం తరువాత పడుతున్న ఈ వర్షం ఖరీఫ్ సీజన్‌లో సాగైన ఆరుతడి పంటలకు ఎంతో మేలని పలువురు రైతులు తెలిపారు. ముఖ్యంగా వరి, పత్తి, వేరుశనగ, కంది, మినుము, పెసర, జొన్న, పసుపు, పూలు, పండ్ల తోటలకు బాగా ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ వర్షంతో పంటలకు సోకిన తెగుళ్లు కూడా దూరమయ్యే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ఈ వర్షం ఇలాగే మరో రెండు రోజులపాటు అధికంగా కురిస్తే కొన్ని ఆరుతడి పంటలు దెబ్బతినే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఏదిఏమైనా ఈ తుపాను వర్షాలలో జిల్లాలో రబీ సీజన్ ప్రారంభం కానుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో భూమి పదునెక్కితే జిల్లాలో శనగపంట సాగు ఊపందుకోనుంది. జిల్లా వ్యాప్తంగా ఈ రబీ సీజన్‌లో 2 లక్షల ఎకరాలకు పైగా శనగ పంట సాగు కానుంది. దీంతోపాటు పలు రకాల ఆరుతడి పంటల సాగు ప్రారంభం కానుంది. కాగా ఈ వర్షాలతో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటితోపాటు విద్యుత్తు, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు.

వరిపంట..

వర్షం ఎక్కువైతే, పొలాల్లో నీరు నిలబడకుండా బయటికి పంపాలి. వీలైనంత వరకు ఇప్పుడు పైపాటి ఎరువులు వేసుకోకూడదు, అవసరం అయితే వర్షం తగ్గిన తర్వాత పైపాటి ఎరువులు వేసుకోవాలి.

వేరుశనగ పంట..

పంట కోతలు పూర్తయి ఉంటే వేరుశనగ కాయలు తడవకుండా టార్పాలిన్స్‌తో కప్పి ఉంచుకోవాలి. ఒకవేళ కోతకు సిద్ధంగా ఉంటే వర్షం తగ్గిన తర్వాత కోతలు చేసుకోవాలి.

పత్తిపంట..

పత్తి తోటలు చివరి దశలో ఉన్నాయి. కనుక ఈ చివరి పత్తితీతను వాయిదా వేసుకోవాలి. లేదా త్వరగా చివరి తీత పూర్తి చేసుకొని, తీసుకున్న పత్తి వర్షంలో తడవకుండా కాపాడుకోవాలి.

పప్పు శనగ..

జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గిన తర్వాత శనగపంటను విత్తుకుంటే మంచిది. పప్పు శనగ పంటను అక్టోబర్ 15 తర్వాత విత్తుకుంటే చీడపీడలు ఆశించే అవకాశం తక్కువగా ఉంటుంది.

కంది పంట..

కంది ప్రస్తుతం మొగ్గ నుంచి పూత దశలో ఉంది. కనుక వర్షాలు ఎక్కువై ఎక్కడైనా పొలాల్లో నీరు నిలబడితే, పొలం గట్లను తెంచి నీటిని బయటికి పంపాలి. లేకపోతే వేరుకుళ్లు, ఎండు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది.

విద్యుత్ ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఎక్కడైనా తడిసిన కరెంట్ స్తంభాలను తాకరాదు.
- రైతులు తడిసిన చేతులతో స్టార్టర్లు కానీ మోటార్లు కానీ ముట్టుకోరాదు.
- విద్యుత్ లైన్‌కు తగులుకున్న చెట్లను పట్టుకోకూడదు.
- విద్యుత్ లైన్‌కు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి తెలియజేయాలి.
- పార్కులలో గాని స్టేడియంలో గాని విద్యుత్ స్తంభాలు ముట్టుకోరాదు.
- ఇళ్లలో ఉన్న వాళ్లు స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోకూడదు.
- ఆరు బయట ఉన్న వీధిలైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలి.
- కరెంటుకు సంబంధించిన ఏ వస్తువును కూడా తడి చేతులతో ముట్టుకోరాదు.
- చిన్న పిల్లలు కరెంటు వస్తువులను తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదు.
- గాలి, దుమారం, వర్షం వలన తెగిన విద్యుత్ వైర్లను ఎవరూ ముట్టుకోకూడదు. అలా ఎక్కడైనా తీగలు తెగిపడి ఉంటే విద్యుత్తు అధికారులకు తెలియజేయాలి.
- ఇళ్లలో ఉన్న వాటర్ హీటర్ స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతనే నీళ్ల పెట్టిన వస్తువును ముట్టుకోవాలి.
- ఇళ్లలోని టీవీలకు సంబంధించి ఉరుములు మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయాలి.
- వర్షం పడుతున్నప్పుడు టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్లకు సంబంధించిన స్విచ్‌లను ఆఫ్ చేయాలి. లేకుంటే వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంటుంది.
- విద్యుత్తు కరెంటు లైన్ కింద నిలబడి ఎవరు కూడా సెల్ ఫోన్ మాట్లాడకూడదు.
- ఇళ్లలోకి వచ్చే సర్వీస్ వైర్ ఏమైనా డ్యామేజ్ అయినట్లయితే సంబంధిత విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని జేఎల్ఎం, ఏఎల్ఎం, ఎల్ఎంలతో పాటు ఏఈల దృష్టికి తీసుకెళ్లాలని విద్యుత్తుశాఖ అధికారులు సూచించారు.

రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



జిల్లాలో కురుస్తున్న వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండి తమ పంటలను కాపాడుకోవాలి. ఈ వర్షం జిల్లాలో ఈ నెల 16వ తేదీ వరకు పడే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ తెలుపుతోంది. రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ప్రస్తుత పంటలను కాపాడుకోవాలి. వ్యవసాయ అధికారుల సూచనలను కచ్చితంగా ప్రతి రైతు పాటించాలి.

\- అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

రిమ్స్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కడప అర్బన్ : కడప రిమ్స్ ఆసుపత్రిలో సెప్టెంబర్ 21న పులివెందుల నుంచి ఉత్తన్న (50) అనే పేరుతో గుర్తు తెలియని వ్యక్తి చికిత్స కోసం వచ్చాడు. సోమవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో ఆ వ్యక్తి మృతి చెందాడు. అతని మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో ఉంచారు. అతని మృతదేహానికి సంబంధించిన ఆధారాలు ఏవైనా ఉంటే తమను సంప్రదించాలని రిమ్స్ వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని భాకరాపేట సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. బద్వేలు మండలం ఎత్తిరాజుపల్లె ఎస్టీ కాలనీకి చెందిన ఎస్.రవి(25) ఓ పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంలో పట్టణానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా భాకరాపేట సమీపంలోకి వచ్చే సరికి పాలవ్యాన్ ఢీ కొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వాల్మీకిపురం : గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన వాల్మీకిపురం పట్టణం తిరుచుట్టివీధిలో చోటు చేసుకొంది. వివరాలు.. తిరుచుట్టివీధికి చెందిన సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి నెల రోజుల క్రితం విదేశాలకు వెళ్లారు. ఇదే అదనుగా గుర్తు తెలియని దుండగులు సుధీర్ రెడ్డి ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలు, కప్‌బోర్డులను ధ్వంసం చేసి అందులోని వెండి వస్తువులతో పాటు బంగారు నగలు, విలువైన వస్తువులు దోచుకెళ్లారు.

పెన్నా ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జమ్మలమడుగు : పెన్నానది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు ఎవరు కూడా పెన్నానదిలోకి వెళ్లకూడదని మైలవరం ఇరిగేషన్ ఈఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి ఐదువేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. రాబోయే రెండు మూడు రోజులలో కురిసే వర్షాలకు పెన్నానదికి లక్ష నుంచి లక్షా 50వేల క్యూసెక్కుల నీరు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. కనుక ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లో పెన్నానదిలోకి వెళ్లకూడదని హెచ్చరించారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

మూడు రోజుల పాటు భారీ వర్ష సూచన కారణంగా పట్టణ పరిధిలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు కలిగితే వెంటనే 8074269513 కంట్రోల్ రూంకు ఫోన్ చేయాలని సూచించారు. పర్యవేక్షణ అధికారులుగా ఉమామహేశ్వరి, మధుకుమార్ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

నవంబర్ 9,10 తేదీల్లో కడపలో జాతీయ స్థాయి ఉర్దూ సెమినార్

కడప ఎడ్యుకేషన్ : అంజుమన్ తరఖ్ఖి ఉర్దూ (ఉర్దూ భాషాభివృద్ధి సంఘం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 9.10 తేదీలలో కడప నగరం నాగరాజుపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి ఉర్దూ సెమినార్ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్తార్ ఫైజి, సయ్యద్ హిదాయతుల్లా తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్య, మైనార్టీశాఖ మంత్రులు, ఎంఎల్ఏలను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. వీరితోపాటు అన్ని పార్టీల నాయకులు, అధికారులు అంజుమన్ తరఖ్ఖి వివిధ జిల్లాల శాఖల ప్రతినిధులు, ఉర్దూ కవులు, రచయితలు, విమర్శకులు ఉర్దూ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. దేశంలోని ఐదు రాష్ట్రాల నుంచి దాదాపు 24 మంది ఉర్దూకు సంబంధించి వివిధ అంశాలపై పరిశోధన పత్రాలు సమర్పిస్తారన్నారు. అలాగే ఉర్దూ పుస్తకాల ఆవిష్కరణ, కవి సమ్మేళనం ఉంటుందని తెలిపారు. ఉర్దూ హైస్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు, యూనివర్సిటీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నామని వివరించారు.

సంక్షేమ హాస్టళ్లను తనిఖీ చేసిన న్యాయమూర్తి



హాస్టల్ గదిలోని స్టోర్ రూంను తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ పరిధిలోని సంక్షేమ హాస్టళ్లను రాయచోటి జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు రాయచోటి – రాజంపేట రోడ్డులోని గిరిజన సంక్షేమ హాస్టల్‌తో పాటు బీసీ హాస్టల్‌ను కూడా తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడుతూ వసతి గృహాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వంట గదులు, స్టోర్ రూంలు, డార్మెంట్స్ ఇలా హాస్టల్‌లోని అన్ని గదులను పరిశీలించారు. అక్కడి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి స్కేటింగ్ ఎంపికలు



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలోని స్కేటింగ్ రింక్‌లో సోమవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. అండర్–11, అండర్–14, అండర్–17 బాలబాలికల విభాగాల్లో ఎంపికలు నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి, ఫిజికల్ డైరెక్టర్ ఇజ్రాయిల్, కోచ్ విలియం కేర్, మహేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

క్వాడ్ విభాగంలో..

అండర్–11 బాలికలు : కె. ఉపాసన, ఎస్.డి. సాదియ, యోధినిరెడ్డి.

అండర్–11 బాలురు : మహివర్షిత్‌రెడ్డి, సాఖీఫ్, భవేష్

అండర్–14 బాలికలు : మోక్షిత, మోహన, సహస్వి

అండర్–14 బాలురు : వెంకట్, యశ్వంత్‌కుమార్, పార్థీవ్

అండర్–17 బాలికలు : నందిని

అండర్–17 బాలురు : భరత్, వైష్ణవ్‌కృష్ణ, సాయి శశాంక్

ఇన్‌లైన్ విభాగంలో..

అండర్–11 బాలికలు : సన, నిర్వాణ

అండర్–11 బాలురు : పార్థివన్‌రెడ్డి, మారుతీశ్రీరాం, సాయిజయవర్ధన్.

అండర్–14 బాలికలు : దీత్యారెడ్డి, రాహిత

అండర్–14 బాలురు : సాకేత్‌రెడ్డి, శశాంక్‌రెడ్డి, ప్రణీత్

అండర్–17 బాలురు : జెస్సీరోహన్

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు



దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ జీవన్ గంగానాథ్ బాబు

పులివెందుల రూరల్ : ఈ ఏడాది ఆగస్టు 8వ తేదీన పులివెందుల పట్టణంలోని కదిరి రోడ్డులో ప్రభుత్వ మద్యం షాపులో జరిగిన చోరీకి సంబంధించి మరో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు మద్యం దుకాణంలోకి చొరబడి సుమారు రూ.4లక్షలు నగదు ఎత్తుకెళ్లిన విషయం విదితమే. అప్పట్లో ఈ దొంగతనంపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి రెండో నిందితుడు అలెగ్జాండర్‌ను ఆదివారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామని సీఐ జీవన్ గంగానాథ్ బాబు తెలిపారు. సోమవారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో అరెస్టు వివరాలు వెల్లడించారు. అలెగ్జాండర్ వృత్తిరీత్యా డ్రైవర్ అని తెలిపారు. పులివెందుల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో సంచరిస్తుండగా అతన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి లక్ష రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం.. అపహాస్యం

ప్రభుత్వ కార్యక్రమ వేదికలపై టీడీపీ నేతలు



వేదికపై ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డికి ఎంపీడీఓకు మధ్యలో కూర్చున్న టీడీపీ నేత విజయ భాస్కర్ రెడ్డి

సాక్షి టాస్క్‌ఫోర్స్ : టీడీపీ నేతల నిర్వాకంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోంది. కనీసం వార్డు సభ్యులు కూడా కాని వ్యక్తులు సైతం ప్రభుత్వ కార్యక్రమాల వేదికలపై ఆశీనులవుతూ అధికారులపై పెత్తనం చెలాయించడానికి ప్రయత్నిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

అది కూడా సాక్షాత్తూ ఎమ్మెల్యేల సమక్షంలోనే జరుగుతుండడం అటు ప్రజా ప్రతినిధులకు, ఇటు అధికారులకు మింగుడు పడటం లేదు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు, మండల సర్వసభ్య సమావేశాలు, మునిసిపల్ సమావేశాలకు ప్రొటోకాల్ మేరకు సంబంధిత ఎమ్మెల్యేలను అధికారులు ఆహ్వానించడం సర్వసాధారణం. ఎమ్మెల్యేలు సైతం తమకు ఉన్న వీలును బట్టి ఆయా కార్యక్రమాలకు హాజరవుతుంటారు. కానీ వారితో పాటు కేవలం టీడీపీ నేతలమన్న ఒకే ఒక్క కారణంగా కనీసం వార్డు మెంబర్లు కాని వ్యక్తులు సైతం వేదికలపై ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల పక్కన దర్జాగా కూర్చోవడం చర్చనీయాంశంగా మారుతోంది. ఒక రకంగా అధికారులు సదరు వ్యక్తి చెప్పినట్లుగా నడుచుకోవాలని ఎమ్మెల్యేలు సంకేతాలు ఇచ్చినట్లేనని, ప్రజాస్వామ్యంలో ఇది అంత మంచిది కాదని పలువురు పేర్కొంటున్నారు.

కమలాపురం నియోజకవర్గంలో యథేచ్ఛగా ఉల్లంఘనలు

కమలాపురం నియోజకవర్గంలో ఇలాంటి సంఘటనలు షరా మామూలుగా మారాయి. తాజాగా సోమవారం జరిగిన చెన్నూరు మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి పక్కన ఈ సమావేశానికి ఎలాంటి సంబంధం లేని టీడీపీ నేత విజయ భాస్కర్ రెడ్డి కూర్చోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించి ప్రొటోకాల్‌కు విలువ ఇవ్వాల్సిన ఎమ్మెల్యే సమక్షంలోనే ఇలాంటివి జరగడంపై విమర్శలు వినవస్తున్నాయి.

ఆధునిక దంత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అత్యాధునిక పరికరాలతో అత్యుత్తమ దంత వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన శ్రీ సత్యసాయి గోకుల్ డెంటల్ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులు రెడ్డి సూచించారు. కడప నగరంలోని పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్దగల గోకుల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన శ్రీ సత్యసాయి గోకుల్ డెంటల్ సూపర్ స్పెషాలిటీ డిజిటల్ క్లినిక్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. గత 40 సంవత్సరాలుగా దంత వైద్య రంగంలో రాణిస్తూ ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న డాక్టర్ సందా సూర్యప్రకాశ్ అత్యాధునిక పరికరాలతో నూతన భవనంలో ఆస్పత్రిని ఏర్పాటు చేశారన్నారు. డాక్టర్ సందా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ దంత వైద్య సేవలకు సంబంధించి అన్ని రకాలైన చికిత్సలు, అత్యాధునిక పద్ధతుల్లో స్పెషలిస్టు వైద్యుల ఆధ్వర్యంలో ఈ ఆస్పత్రిని ప్రారంభించామన్నారు. ఆధునిక డెంటల్ స్కానింగ్, డిజిటల్ ఎక్స్‌రే తదితర సదుపాయాలన్నీ లభిస్తాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు మెడికల్ రీఎంబర్స్‌మెంట్ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు, డాక్టర్ సందా సూర్యప్రకాశ్ కుటుంబ సభ్యులు, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డుపై ప్రమాదం

ఇద్దరు కర్ణాటక పర్యాటకులకు తీవ్ర గాయాలు

బి.కొత్తకోట : సరదాగా హార్సిలీహిల్స్ చూసొద్దామని బైక్‌లపై వచ్చిన కర్ణాటకకు చెందిన పర్యాటకులు ఘాట్‌రోడ్డుపై ప్రమాదానికి గురయ్యారు. పోలీసుల కథనం మేరకు సోమవారం జరిగిన ఈ ఘటన వివరాలు.. కర్ణాటకలోని కేజీఎఫ్‌కు చెందిన ఎం.పవన్‌కుమార్ (23), భరత్ (20)ఒక బైక్‌పై, మిగిలిన వారు మరో రెండు బైక్‌లపై హార్సిలీహిల్స్‌కు బయలుదేరారు. అలాగే మదనపల్లె ఎగువ కురవంకకు చెందిన పునీత్ కుమార్ (20) కారు హార్సిలీహిల్స్ నుంచి వెనుదిరిగింది. మధ్యాహ్నం 3 గంటలు దాటిన తర్వాత కిందకు వస్తున్న కారు, పైకి వెళ్తున్న బైకు కింద నుంచి నాలుగో మలుపు దాటగానే ఎదురెదురుగా ఢీకొనే ప్రమాదాన్ని పసిగట్టిన కారు నడుపుతున్న పునీత్ ప్రమాదాన్ని నివారించేందుకు సడన్ బ్రేక్ వేశాడు. దీంతో కారు మలుపు తిరిగి ప్రమాదానికి గురైంది. ఇదే సమయంలో బైక్ అదుపు కాకపోవడంతో కారును ఢీకొంది. దీంతో బైక్ పూర్తిగా ధ్వంసమైంది. బైక్ నడుపుతున్న పవన్‌కు కాలు, చేయి విరిగింది. వెనుక కూర్చున్న భరత్‌కు తీవ్ర గాయమైంది. కారులోని వారికి ఎలాంటి ప్రమాదం కాలేదు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో మదనపల్లెకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాధితులను బెంగళూరుకు తీసుకెళ్లినట్టు తెలిసింది. ఈ ఘటనతో విహార యాత్ర విషాదంగా మారింది.

ఎదురెదురుగా వాహనాలు ఢీకొని..

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లె మండలం కొండామారిపల్లె పంచాయతీ బెస్తపల్లెకు చెందిన గంగులప్ప భార్య సీతమ్మ(46) బ్యాంకు పనిపై తెలిసిన వ్యక్తితో మదనపల్లెకు ద్విచక్రవాహనంలో వస్తుండగా, బైపాస్ రోడ్డులో ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో సీతమ్మ తీవ్రంగా గాయపడింది. అదేవిధంగా కడప చిన్నపరెడ్డిపల్లెకు చెందిన వీరభద్రారెడ్డి కుమారుడు శివకాశిరెడ్డి(26) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సోమవారం స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో బెంగళూరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలో కురబలకోట మండలం చేనేతనగర్ వద్ద ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని కారు, ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో శివకాశిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి తండ్రీ కొడుకులకు..

బి.కొత్తకోట : ఎదురుగా ఆవులు రావడంతో బైక్ అదుపు తప్పి తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలైన ఘటన సోమవారం మండలంలోని నాయనబావి వద్ద జరిగింది. స్థానికుల కథనం మేరకు..ములకలచెరువు మండలం మద్దినాయునిపల్లె పంచాయతీ ఎర్రంరెడ్డిగారిపల్లెకు చెందిన తండ్రీ కొడుకులు రామచంద్ర (58), శ్రీనివాసులురెడ్డి (35) వ్యక్తిగత పనులపై బి.కొత్తకోటకు వచ్చారు. పనులు చూసుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. బి.కొత్తకోట నుంచి మదనపల్లె మార్గంలో వెళ్తుండగా నాయనబావి వద్ద రోడ్డుపై ఆవులు అడ్డంగా రావడంతో బైక్‌ను నిలిపే ప్రయత్నంలో అదుపు తప్పింది. దీంతో ప్రమాదానికి గురైన తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు.

పులివెందులలో ఈ–స్టాంపుల కొరత

పులివెందుల టౌన్ : పులివెందులలో గత 50రోజుల నుంచి ఈ–స్టాంపుల కొరత ఏర్పడింది. దీంతో ఈ–స్టాంపులు కావాల్సిన వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు ఈ–స్టాంపింగ్‌ను ప్రవేశపెట్టింది. ఈ–స్టాంపింగ్ ద్వారా రూ.10, రూ.20, రూ.50,రూ. 100ల స్టాంపులను ప్రింటింగ్ చేసి ఇచ్చేవారు. గతంలో స్టాంపులను వారి పేర్ల మీద తీసుకుని వారికి కావాల్సిన విధంగా రాసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారనే కారణంగా ఈ–స్టాంపింగ్‌ను గత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్లు సజావుగా జరిగేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎందుకో, ఏమో తెలియదు కానీ గత 50 రోజులుగా ఈ–స్టాంపులు ఇవ్వడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. గతంలో స్టాంపు వెండర్స్ ద్వారా, సీఎస్‌సీ ద్వారా ఈ–స్టాంపింగ్ అందజేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వం కేవలం స్టాంపు వెండర్స్ ద్వారానే ఈ స్టాంపింగ్ ఇస్తున్నారు. సీఎస్సీ వారికి స్టాంపులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు తెలుస్తోంది. వీటిపై అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకుండా ఉంది. ఇప్పటికైనా పులివెందుల ప్రాంత ప్రజలకు సజావుగా ఈ–స్టాంపింగ్ అందే విధంగా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.